క్లుప్తంగా

ఆరోగ్య సమాజం అందరి బాధ్యత



గన్నవరం: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆస్పత్రిలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందితో ఆమె స్వచ్ఛతాహి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శారమ్మ మాట్లాడుతూ.. ఆస్పత్రితో పాటు పరిసరాలను ప్రతిరోజూ సిబ్బంది పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సైతం స్వచ్ఛత ప్రమాణాలను పాటించడం ద్వారా వ్యాధులకు దూరం చేయవచ్చని తెలిపారు. పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీలో అనన్య ప్రతిభ



పెనమలూరు: జాతీయ స్థాయి కరాటే పోటీలో చిన్నారి సుంకు అనన్య రెండు పతకాలు గెలిచింది. కోచ్ దుర్గారావు ఆదివారం వివరాలు తెలిపారు. అద్దంకిలో ఆదివారం జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయన్నారు. 8 సంవత్సరాల విభాగంలో సుంకు అనన్య కలర్ బెల్టు కాటా విభాగంలో బంగారు పతకం, కుమిటే ఈవెంట్‌లో బంగారు పతకం గెలిచిందని తెలిపారు. ఈ పోటీలో దాదాపు 500 మంది క్రీడాకారులు పాల్గొనగా అనన్య సత్తాచాటిందని తెలిపారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి

రామవరప్పాడు: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. సమస్యాత్మకంగా మారిన డ్రైయిన్లను గుర్తించారు. మురుగునీరు సజావుగా పారుదల అయ్యేందుకు పూడికతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. సమీప నివాసాల్లో చెత్త డంప్ చేయకుండా చెత్త కుండీలలోనే పడేయాలని సూచించారు. మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తితే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలి


ఘంటసాల: ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్ కౌంటర్లపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని ఏపీ పౌరహక్కుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జక్కా కేశవరావు డిమాండ్ చేశారు. ఘంటసాల గోటకంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో బీజేపీ ప్రభుత్వం గిరిజనులపై సాగిస్తున్న ఎన్ కౌంటర్లను ఆపివేయాలన్నారు. జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, ఒడిశా, ఏఓబీ ప్రాంతాలలో సాయుధ పారామిలటరీ బలగాలతో నిరాయుధులైన గిరిజనుల హత్యలను ఖండిస్తున్నామన్నారు. బూటకపు ఎన్ కౌంటర్లపై విచారణ జరిపి బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.జాన్సన్, సహాధ్యక్షుడిగా డి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా వి.దీపక్, ఆర్థిక కార్యదర్శిగా హరీష్, ఉపాధ్యక్షులుగా బి.నాగేంద్రం, సురేష్, రమాదేవి, సుధాకర్, జాయింట్ సెక్రటరీలుగా గోపాల్‌సింగ్, రాధిక, వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం తెల్లవారుజామునుంచే క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణం ఎటు చూసినా భక్తులతో నిండిపోయింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాలువలు ఇలా.. సాగునీరు ఎలా?

- ఆనవాళ్లు కోల్పోతున్న పంట కాలువలు
- వ్యర్థాలతో నిండిపోతున్న వైనం
- కంపచెట్లు ఏపుగా పెరిగి నీటి పారుదలకు ఆటంకం
- నిర్వహణ సక్రమంగా లేకపోవటమే కారణమంటున్న రైతులు



మర్లపాలెం రోడ్డులో చెట్ల మధ్య కనిపించని పంటకాలువ



తెంపల్లి రోడ్డులో ఆనవాళ్లు కోల్పోయిన పంట కాలువ

గన్నవరం రూరల్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట కాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. పంట కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఆక్రమణలకు గురవుతున్నాయి. బాధ్యత మరచిన కొందరు వ్యక్తుల కారణంగా పంట కాలువలు వ్యర్థాలతో నిండిపోతున్నాయి. మండలంలో కొన్ని పంటకాలువలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

మండలంలో..

మండలంలో 21 గ్రామాలుండగా, వీటిలో 17,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఉద్యాన పంటలు మూడు వేల ఎకరాల్లో సాగులో ఉన్నాయి. ఇవిగాక కూరగాయలు, మామిడి తోటలు వేలాది ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

పంట కాలువలు ఇలా..

ఏ గ్రామంలో చూసినా రహదారుల వెంట పెద్ద పంట కాలువలు ఉంటాయి. వాటి నిండా కంప చెట్లు, వ్యర్థాలు పేరుకుపోయాయి. పొదలు, ఇతర గడ్డిజాతి మొక్కలతో నిండిపోయి ఉంటున్నాయి. పంటకాల్వల వెడల్పు తగ్గిపోయి సాగునీరు, మురుగు నీరు కదలలేని పరిస్థితి. అసలు ఆనవాళ్లే కోల్పోతున్నాయి.

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్యం

ప్రతి సంవత్సరం గ్రామ గ్రామానా పంట కాల్వలు పర్యవేక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఆ సంగతి మరిచాయి. దీంతో ఆక్రమణలు పెరిగిపోయాయి. స్వరూపం కోల్పోయాయి. వ్యవసాయంలో కౌలు రైతులు పెరగటంతో యజమానులు పంటకాల్వల పర్యవేక్షణ పట్టించుకోవటం లేదు. దీంతో ప్రభుత్వ రెవెన్యూ కొలతల ప్రకారం ఉండాల్సిన పంట కాల్వలు రోజురోజుకు కుంచించుకుపోతున్నాయి.

వెంచర్ల వద్ద మరింత దారుణంగా..

భూముల ధరలు పెరగటంతో అన్ని గ్రామాల్లోనూ రియల్ ఎస్టేట్ వెంచర్‌లు వెలిశాయి. ఈ దెబ్బకు పంటకాలువల్లో చిన్నపాటి తూములు వేసి, వాటిని సైతం ఆక్రమించేశారు. వెంచర్ దారులకు రాజకీయ మద్దతు ఉండటంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.



వీరపనేనిగూడెంలో రహదారిలో స్వరూపం కోల్పోయిన పంట కాలువ

'ఉపాధి' పథకం కింద అభివృద్ధి చేయాలి..

ప్రతి ఏటా ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా పంట కాలువల తవ్వకాన్ని చేపడుతున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పంట కాలువలు తవ్వించి సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

పంటకాలువల్లోనే వ్యర్థాలు..

గ్రామాల్లో వ్యర్థాలను ఈ పంట కాలువల్లో డంప్ చేస్తున్నారు. గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేని కారణంగా పంచాయతీలు వ్యర్థాలను తరలిస్తూ రోడ్ల వెంట పెద్ద పంట కాలువల్లో పడేస్తున్నారు. శుభకార్యాలు జరిగినప్పుడు ఆ వ్యర్థాలను కూడా పంట కాలువల్లో రోడ్ల వెంట పడవేయటం ఆనవాయితీగా మారిపోయింది.

కాలువలు బాగుజేయండి



గ్రామాల్లో పంట కాలువలు సర్వే చేయించి బాగుచేయించాలి. ఖరీఫ్ సీజన్‌కు కాలువలు బాగుజేసి, వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా చూడాలి. వ్యర్థాలు పంట కాలువల్లో పడవేయకుండా అవగాహన కల్పించాలి. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి.

– మిరప నాగేశ్వరరావు, సీపీఎం మండల నాయకుడు

సర్వే చేయించాలి..



గ్రామాల్లో పంట కాలువలు సర్వే చేయించాలి. ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలి. ఈ వేసవిలో ప్రధాన కాలువలు బాగుజేయించి రైతులను ఆదుకోవాలి. సాగునీరు నడవక రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు.

– అంగడాల సాంబశివరావు, రైతు, కొత్తగూడెం

పంట కాలువలు బాగుచేయిస్తాం..

అన్ని గ్రామాల్లోనూ పంట కాలువలు బాగుచేయించేందుకు ప్రణాళిక రూపొందించాం. గ్రామ సభల్లో రైతుల కోరిక మేరకు పూడుకుపోయిన, దుస్థితిలో ఉన్న పంట కాలువలను గుర్తించాం. ఇప్పటికే కాలువల అభివృద్ధికి తీర్మానాలు చేయించాం. ఈ వేసవిలో ఉపాధి కూలీలతో పంట కాలువలను బాగుజేస్తాం.

– సత్యప్రియ, ఏపీవో, ఉపాధి పథకం

సర్వేలను వేగవంతం చేయాలి



నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేలను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.మురళీకృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న సర్వేలను ఆయన పరిశీలించారు. నున్న గ్రామ పంచాయతీలో మూడు సచివాలయాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జియోట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ సర్వే మ్యాపింగ్, ఎంప్లాయీస్ మిస్సింగ్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, నాన్ ఏపీ రెసిడెన్స్ సర్వే (వేరే ప్రాంతాలకు వెళ్లిన వారు, వివిధ రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి వచ్చినవారి వివరాల సేకరణ) చిల్డ్రన్స్ ఆధార్ సర్వే నిర్వహించడంలో విజయవాడ రూరల్ మండలం ఎన్టీఆర్ జిల్లాలో 15వ స్థానం లో ఉందన్నారు. మండలంలోని 32 సచివాలయాల్లో 15 సచివాలయాలను స్వయంగా పరిశీలించారు. సెలవు రోజు అయినప్పటికీ సర్వే కొనసాగిస్తున్నామన్నారు. సిబ్బంది సమన్వయంతో సర్వేలు నిర్వహించినట్లయితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు సర్వేలను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురులో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ యనమలకుదురులో మహాశివరాత్రి మహోత్సవం సందర్భంగా సాయినగర్ విద్యుత్ ఫీడర్ మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కారణంగా గ్రామంలో ఉదయం 7.30 గంటల నుంచి 12 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా సాయినగర్, పుట్టరోడ్డు, మాదు తిరుతి రావునగర్, టవర్ రోడ్డు, శివపార్వతీనగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

రెచ్చిపోతున్న అల్లరి మూకలు

- ఘర్షణలకు నెలవుగా గోసాల వంతెన సెంటరు
- రాత్రయితే చాలు నిత్యం గొడవలు
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం



గోసాల వంతెన సెంటరు

కంకిపాడు: అల్లరి మూకలు రెచ్చిపోతున్నాయి. అధికార పార్టీ అండదండలతో కొందరు యువత కయ్యానికి కాలు దువ్వుతూ నిత్యం ఘర్షణలకు పాల్పడుతున్నారు. రాత్రయితే చాలు ఆ ప్రాంతం అంతా గొడవలు, ఘర్షణలే. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం ఆ ప్రాంతంపై దృష్టి పెట్టడం లేదు. దీంతో సాధారణ ప్రజానీకం గోసాల వంతెన సెంటరు ప్రాంతం మీదుగా రాకపోకలు అంటేనే హడలిపోతున్నారు.

సెంటర్ ప్రాధాన్యత ఇదీ..

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి నుంచి గోసాల, వణుకూరు, మద్దూరు మీదుగా కరకట్టను కలిసే రోడ్డు మార్గం ఉంది. మార్గమధ్యంలో గోసాల వంతెన సెంటరు ఉంది. స్థానికంగా క్రషర్ పాయింట్లు, చిన్న హోటళ్లు, పచారీ సరుకుల దుకాణాలు, ప్రథమ చికిత్సా కేంద్రాలతో పాటు మద్యం దుకాణం కూడా ఉంది. ఇటీవల కాలంలో పలువురు రియల్ వ్యాపారులు బహుళ అంతస్తుల భవనాలను నిర్మించటంతో అనేక మంది ఇక్కడ నివాసం ఉంటున్నారు.

రాత్రయితే ఘర్షణలే..

రాత్రయ్యిందంటే గోసాల వంతెన సెంటరు అంటేనే ప్రజలు హడలిపోతున్నారు. స్థానికంగా ఉన్న కొందరు యువత మద్యం సేవించి నడిరోడ్డుపై యాగీ చేస్తున్నారు. వివిధ పనుల మీద సెంటరుకు వచ్చిన వ్యక్తులను కావాలని పలకరించి ఘర్షణలకు పాల్పడటం పలువురు యువతకు అలవాటుగా మారింది. విచక్షణారహితంగా దాడులు చేయటం, తమకు అధికార పార్టీకి చెందిన ముఖ్యనేతలు అండగా ఉన్నారంటూ బాహాటంగా చెప్పుకుంటూ రెచ్చిపోతున్నారు. తమకు ఎదురైతే పోలీసులను సైతం వదిలేది లేదంటూ పెట్రేగిపోతున్నారంటే సమస్య తీవ్రత అర్థమవుతుంది. ఘర్షణలకు నెలవుగా మారటంతో రాత్రిళ్లు ఈ ప్రాంతం మీదుగా ప్రయాణం అంటేనే భయాందోళనలు చెందుతున్నారు.

కొరవడిన పోలీసుల నిఘా..

ఇంత జరుగుతున్నా ఈ ప్రాంతంపై పోలీసులు నిఘా లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిత్యం ఘర్షణలకు పాల్పడుతూ ప్రజల్ని బెంబేలెత్తిస్తున్న యువతను కట్టడి చేయటంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అర్ధరాత్రి వరకూ ఈ సెంటరు కేంద్రంగా జరిగే ఘటనలపై దృష్టి సారించి ఆటకట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు వైద్య శిబిరం

కంకిపాడు: దేవినేనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 17న నెప్పల్లి గ్రామంలోని శ్రీ రేణుక అంకమ్మతల్లి ఆలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అమరావతి కంటి ఆసుపత్రి, దుహిత డెంటల్ ఆసుపత్రి, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, స్రవంతి హాస్పిటల్ సౌజన్యంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న ప్రతిష్ఠా మహోత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని శ్రీగంగా బాలత్రిపుర సుందరీ దేవి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానం పునః నిర్మాణం, నూతన నవగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 23వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 21వ తేదీ నుంచి వేదపండితులతో మూడు రోజుల పాటు ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వివరించారు. ఆలయ ముఖ్యదాతలు నందూరు శ్రీరంగసాయి, లలితమ్మ దంపతులు, తాడిశెట్టి శ్రీహరి, నాగరూప దంపతుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 23న అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌సీసీ 'సీ' సర్టిఫికెట్ కోసం రాత పరీక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): కాకినాడ గ్రూప్ పరిధిలో ఎన్‌సీసీ యూనిట్లకు ఆదివారం విజయవాడలోని నలంద విద్యానికేతన్, పీబీ సిద్ధార్థ కళాశాల, ఆంధ్రా లయోల కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. కాగా శనివారం సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు, ఆదివారం రాత పరీక్షను నిర్వహించారు. ఎన్‌సీసీలో మూడేళ్ల పాటు శ్రమించి నేర్చుకున్న పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షకు క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాశారు. నలంద విద్యానికేతన్‌లో ఫోర్ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్ పర్యవేక్షణలో నిర్వహించిన రాత పరీక్షలో 16 , 17 బెటాలియన్ కు చెందిన 280 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పరీక్షకు హాజరయ్యారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ మాట్లాడుతూ విజయవాడ లో మూడు కేంద్రాల్లోపరీక్షనిర్వహించామన్నారు.

వైభవంగా వీరమ్మతల్లి తిరునాళ్ల



భక్తులతో అమ్మవారి ఆలయ ప్రాంగణం

ఉయ్యూరు: స్థానిక వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అమ్మవారిని దర్శించుకుని పొట్టేళ్లను కానుకగా సమర్పించారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజా కార్యక్రమాలు జరిపించారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వీరమ్మతల్లి చల్లని చూపు, ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరినట్లు తెలిపారు.



వీరమ్మతల్లికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు జరిపిస్తున్న వైఎస్సార్ సీపీ నేత దేవభక్తుని చక్రవర్తి



అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు వస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

లింగంచెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



వేలేరులోని లింగంచెరువులో మట్టి తవ్వి ట్రాక్టర్‌కు లోడు చేస్తున్న పొక్లెయిన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని లింగంచెరువులో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. అధికార టీడీపీ నేతల అండదండలతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుతున్నారు. లింగంచెరువులో పొక్లెయిన్ ఏర్పాటు చేసి ట్రాక్టర్లతో మట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. అడ్డగోలుగా మట్టి తవ్వకాలు చేపట్టి, సొమ్ము చేసుకుంటున్న టీడీపీ నేతలపై అధికార యంత్రాంగం చర్యలకు దిగకపోవటంపై ఆదివారం స్థానికులు సామాజిక మాధ్యమాల్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎట్టకేలకు బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ ఆదేశాలతో రెవెన్యూ యంత్రాంగం లింగం చెరువు వద్దకు చేరుకుని మట్టి తవ్వకాలను నిలిపివేశారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వి రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని పొక్లెయిన్, ట్రాక్టర్ డ్రైవర్లను రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

ద్విచక్ర వాహనదారులూ హెల్మెట్ ధరించండి!



హెల్మెట్‌లపై అవగాహన కార్యక్రమంలో పలువురికి హెల్మెట్‌లు పంపిణీ చేసిన రోటరీ ప్రతినిధులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి కె.శ్రీనివాస్ సూచించారు. హెల్మెట్ వాడకం వల్ల ప్రమాదాల బారి నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో బందర్ రోడ్ లోని ఓ హోటల్లో ఆదివారం హెల్మెట్ వాడకంతో ప్రయోజనాలు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి కె.శ్రీనివాస్, జోసెఫ్‌లు విచ్చేసి హెల్మెట్ వాడడం వలన కలిగే ప్రయోజనాలను రొటేరియన్స్‌కు వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని సూచించారు. నాణ్యత కలిగిన హెల్మెట్లను వినియోగించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్ ఉండటం వలన తలకు అయ్యే గాయాల బారి నుంచి తప్పించుకోవచ్చు అని చెప్పారు. రోడ్డు ప్రమాదాల బారినపడి చాలామంది యువత తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు కరం కౌర్, కార్యదర్శి అరుణ్ సంపత్, క్లబ్ అడ్వైజర్ పార్థసారథి, క్లబ్ సభ్యులు మురళీ గర్రె,కేపీ కిషన్, కిషోర్ సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అద్భుత సృజనాత్మకత



చిత్రకళా ప్రదర్శనను తిలకిస్తున్న రచయిత సత్యవతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థుల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉంటుందని, దానిని వెలికితీస్తే ఉన్నత వంతులుగా తీర్చిదిద్దాలని తెలుగు రచయిత డాక్టర్ వి.సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, తెలుగు చిత్రకారులు దామెర్ల రామారావు శత వర్ధంతిని పురస్కరించుకుని ఆర్ట్ మేట్ విద్యార్థులచే తెలుగు భాష పై వేసిన చిత్రాల ప్రదర్శన ఆదివారం జరిగింది. గురునానక్‌కాలనీలోని ఆర్ట్ మేట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ చిత్రకళా ప్రదర్శనను రచయిత సత్యవతి ప్రారంభించారు. ఆర్ట్ మేట్ చిత్రకళ సంస్థ డైరెక్టర్ ఎ.సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రకళ పట్ల ఆసక్తిని కల్పించడంతో పాటు మన సంస్కృతిని తెలియచేడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్ననేని మురళీ కృష్ణ పాల్గొనా, సీనియర్ చిత్రకారులు పావులూరి చిదంబరం , అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఆర్.కొండలరావు, చిత్రకళ ప్రేమికులు ఎం.మధుసూదనరావు పాల్గొని ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందచేశారు. సంస్థ సభ్యులు సుధారాణి, సుష్మా, స్వాతి, రజియా, పూర్ణిమ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సహకారంతో సింగ్‌నగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్లో ఆదివారం చిత్రలేఖన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 650 మంది చిన్నారులు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబర్చారు. అనంతరం జరిగిన సభలో అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు ఎస్వీ రామరాజు మాట్లాడుతూ పిల్లలు చదువుల వెంటే పడకుండా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సీహెచ్ పద్మ అధ్యక్షత అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు వెంకటరామరాజు,ఇ.క్రాంతి, ప్రముఖ చిత్రకారులు చిత్రం సుధీర్, సంధ్యారాణి, గిరిధర్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

పెనమలూరు: కానూరులో వ్యభిచార గృహంపై పోలీసులు ఆదివారం దాడి చేసి పలువురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మహదేవపురం కాలనీలో తాడేపల్లికి చెందిన సత్య అనే మహిళ ఇల్లు అద్దెకు తీసుకుంది. ఆమె ఇద్దరు మహిళలను తీసుకు వచ్చి వ్యభిచారం చేయించ సాగింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, ముగ్గురు విటులు పోలీసులకు పట్టుబడ్డారు. నిర్వాహకురాలు సత్య పరారీలో ఉంది. ఫోన్‌లో వచ్చిన సమాచారంతో సత్య వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలవటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు శ్రీనివాసా రెసిడెన్సీలో భార్యభర్తలు సీహెచ్.సూరిబాబు, మాలతి ఉంటున్నారు. వారు శనివారం బైక్‌పై పంటకాలువ రోడ్డులో పటమటకు వెళుతుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు గాయాలు అవటంతో పటమటలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్సకై చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.